# తొలగిన మేఘం



వి.శాంతిప్రబోధ

కుడి ఎడమల పంట పొలాలు పచ్చని లాన్స్‌లా ఉన్నాయి. మధ్యలో ఎత్తుపల్లాల కంకర తేలిన రోడ్డు... పల్లె జీవితం ఒడిదుడుకుల్లా వెలుగు చీకట్లు, సంధ్యా సమయం. నేనున్నానంటూ...బలంగా గాలి వీస్తోంది

దూరంగా కొండలమీద నల్లటి మేఘాలు నీటిముద్దులందిస్తూ... చకచక కదులుతూ ఉన్నాయి..

ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఆమె నడుస్తోంది.

"ఇంకా రెండు కిలోమీటర్లు నడిస్తే కాని ఊరి పొలిమేరల్లోకి చేరను" అనుకుంది ఆమె.

చలికాలం కావడంతో రోడ్డంతా నిర్మానుష్యంగా... నిశ్శబ్దంగా ఉంది.

అప్పటిదాకా దోబూచులాడుతున్న పున్నమి చంద్రుని మింగేసేలా కారుమేఘాలు కదులుతున్నాయి.

నడక వేగం పెంచింది ఆమె...

ఆమెను కలవరపరుస్తూ... వేగంగా నల్లటి చీర చుట్టుకుంటూ అతి దగ్గర్లో ... మేఘాలు.

ఆ చీకటిని చీలుస్తూ... ఏదో వెలుగు.

ఆ నిశ్శబ్ధాన్ని ఛేదిస్తూ... ఏదో శబ్దం.

ఆమె మొహంలో దోబూచులాడిన వెలుగురేఖ, ఫర్వాలేదు ఏదో వాహనం వస్తోంది. బహూశ పోలీసులదే అయి ఉంటుంది. అన్నల వేటలో పోలీసులు తరచూ వస్తూనే ఉన్నారు. ఇక భయంలేదు. ఊర్లో డ్రాప్ చెయ్యమని రిక్వెస్ట్ చేయొచ్చు అనుకుంటూ గబగబ అడుగులేస్తున్న ఆమె పక్కనే కీచుమని శబ్దం చేస్తూ ఆగింది జీపు.

బిలబిలమంటూ యమభటుల్లా దిగారు ఆరుగురు జవాన్లు.

వాళ్ళని చూడగానే లిఫ్ట్ అడగుదామని కొద్ది క్షణాల క్రితం అనుకున్న మాట లోపలే సమాధి అయిపోయింది. ఒళ్ళు జలదరించింది. వెన్నులోంచి చలి బయలుదేరింది.

ఒంటరి ఆడపిల్లని చూడగానే వాళ్ళ కళ్ళలో పేరుకుపోయిన క్రౌర్యానికి, కాఠిన్యానికి కామం తోడైంది.

కుక్కపిల్లకు మాంసం ముక్క దొరికినట్టుగా వారి పెదవులపై విచ్చుకున్న వికృతమైన నవ్వు... ఆ చీకటి తెరల మధ్య... ఆమెను వణికిస్తుండగా... ఆమె గబగబా అడుగులు ముందుకేసింది.

ఆగు... కఠినంగా ఒక గొంతు...

ఎక్కడికి... ?తుపాకి గుండులా... మరో కంఠం.

భయంతో.... ఒకసారి వారివైపు పరికించి చూసిన ఆమె, ఒక్క ఉదుటున పరుగు అందుకుంది.

అయితే రాటుదేలిన వారి ముందు ఆమె ఏపాటి...?

ఒక్క అంగలో ఆమెను అందుకున్నారు వాళ్ళు... ఆమె చేయి పట్టి ఈడ్చుకెళ్ళారు దారిపక్కనే ఉన్న పొలాల్లోకి...

భయంతో గజగజలాడింది ఆమె.

గిలగిలలాడింది ఆమె లేత సుకుమార శరీరం.

విలవిలలాడింది ఆమె హృదయం. తప్పించుకోవడానికి మార్గమే లేదు. ఆమెకు తన పరిస్థితి అర్థమైంది. ఈ భూమి ఇలాగే చీలి తనలో ఇముడ్చుకుంటే...? కొద్ది క్షణాల క్రితం భయపడింది చీకటిపడుతోందని, ఏ విషపురుగులైనా ఉంటాయేమోనని... కానీ... మనిషిని మించిన విషం ఎవరికుంటుంది? అని పరిపరి విధాల ఆలోచిస్తున్న ఆమెకు పక్కనే పెద్ద బండరాయి కనిపించింది, ఏదైతే అదవుతుందన్న తెగింపు... ఒక్కసారి విదిలించుకుని ఆ బండరాయి అందుకోవడం ఒకడిపై విసరడం అంతా అప్తపాటులో జరిగిపోయింది.

"అబ్బా..." అని అరుస్తున్న అతనితో పాటు మిగతా వారంతా మరింత క్రూరంగా ఆమెపై దాడి చేశారు.

అప్పటివరకూ ఎన్నెన్నో అందాలను పంచిన ఆ ప్రదేశం ఆ నికృష్టకార్యాన్ని చూడలేక చీకటి ముసుగువేసుకొంది. వారి పైశాచిక కృత్యానికి బలైన ఆమె నలిగిన శరీరంతో, పగిలిన హృదయంతో స్పృహ లేకుండా... రాత్రంతా అలాగే పడి ఉంది.

ఉదయభానుని నునువెచ్చని కిరణాలు సోకగానే ఆమెలో ఓ చిన్న కదలిక... ఓ సన్నని మూలుగు.

అటుగా వెళ్తున్న ఓ అయ్యచెవిలో ఆ శబ్దం పడింది.

అది విన్న అతను దగ్గరకు వెళ్ళిచూశాడు. ఆమెను గుర్తించాడు. జరిగింది అర్థం చేసుకున్నాడు. ఇంటికి చేర్చాడు. పోలీసులకు పత్రికల వాళ్ళకు కబురందించాడు.

అన్నల ఏరివేత పేరుతో వచ్చిన జవాన్ల ఆగడాలకు అంతే లేకుండా పోయిందనుకున్నారు. అందరు ఊళ్ళో అందమైన ఆడపిల్ల కనిపించడం పాపం అయిందన్నారు. టీచరమ్మకు ఎంత కష్టం వచ్చింది అని తలో విధంగా అనుకున్నారు. తమ సానుభూతి చూపారు.

ఆ మరుసటిరోజు అన్ని పత్రికల్లోను పోలీసు వారి దురాగతాన్ని ఎండగడుతూ గ్యాంగ్ రేప్ గూర్చి ప్రముఖంగా వార్త ప్రచురితమైంది.

ఆ వెంటనే పోలీసుల కౌంటర్ న్యూస్. ఆమె తాగిపడిందని ఆమె ప్రవర్తన మంచిది కాదని... కులట అనీ...

ఆ తర్వాత ఆమెని తన ప్రవర్తన గూర్చి తాము చెప్పినట్లు చెప్పాలని బెదరింపులు.

ఇవేమీ పట్టించుకునే స్థితిలో లేదు. ఆమె ఆవేదన, ఆక్రోశం అంతా ప్రేమించినతని గురించే... ఆమెలోని అణువణువు తపించేది అతని తీయని పిలుపుకోసం, చల్లని స్పర్శ కోసం.

టైఫాయిడ్‌తో మంచమెక్కిన అతని మందుల కోసం, పళ్ల కోసం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్ళి వస్తున్న ఆమె జీవితంలో అదో పీడకల.

★ ★ ★

మనిషి దేన్నయినా భరించగలడేమో గానీ...

ప్రాణాధికంగా ప్రేమించిన వ్యక్తి తన పట్ల చూపే నిర్లిప్తతను తిరస్కారాన్ని భరించగలడా?

పాలలో నీళ్ళలా కలసిపోయి, కష్టంలోనూ, సుఖంలోనూ ఒకరికొకరి తోడూనీడ అంటూ ఎన్నెన్నో బాసలు చేసుకొని అయిన వాళ్ళందరూ తమని విడదీయాలని ప్రయత్నిస్తుంటే వాళ్ళందరికంటే తమ ప్రేమ ముఖ్యం అంటూ ఎగిరొచ్చిన ప్రేమపక్షులు రీతిక, రఫీక్.

కులమతాల కుత్సితాలు, కుతంత్రాలకు అతీతంగా. కలిమిలేములను ఖాతరు చేయకుండా ప్రేమేదైవం అంటూ ప్రేమ జీవితాన్ని పంచుకుంటూన్నదా జంట గత ఆర్నెల్లుగా.

కలలోనైనా ఊహించి ఉండరు వాళ్ళు ఇలాంటి సంఘటన తమ జీవితంలో అల్లకల్లోలం సృష్టిస్తుందని...

★ ★ ★

ఈ సంఘటనతో నా రఫీక్‌లోని ప్రేమ ఇంకిపోయిందా?

ఇన్నాళ్ళూ చూపిన ప్రేమ, అనురాగం అంతా ఇగిరిపోయిందా...? అదంతా వయసు వేడిలో చూపిన ఆకర్షణ మాత్రమేనా? పరిపరివిధాల ఆలోచిస్తోంది ఆమె...

"కాదు... కాదు... నా రఫీక్‌కి నేనంటే ప్రాణం" తనలో తనే అనుకుంది.

"మరయితే ఇంత బాధలో ఉంటే... కష్టంలో ఉంటే ... నలుగురూ నాలుగు రకాలుగా వ్యాఖ్యానిస్తుంటే... నీ మొహం చూడడానికే ఇష్టపడనివాడు...నా జీవితం, నా ఊపిరి అంటూ ఎన్నెన్నో కబుర్లు చెప్పి... ఇప్పుడేం చేస్తున్నట్లో... ఇలాంటి కష్ట సమయంలో అక్కున చేర్చుకొని అనురాగ హస్తం అందించాల్సిన అతను ఇంకా నీ రఫీక్ ఎలా అవుతాడు?" వ్యంగ్యంగా ప్రశ్నించింది ఆమె అంతరాత్మ.

గత రెండు రోజులుగా ఆమె ఈ విధంగా మధనపడుతూనే ఉంది. మర్చిపోదామన్నా మర్చిపోనీకుండా ఆ ఘటననే మళ్లీ మళ్లీ కెలుకుతూ గుండెలో గునపాల్లాంటి మాటలతో పొడుస్తూ...విసిగిస్తూ... పోలీసులు, పత్రికల వాళ్లు, డాక్టర్, తెలిసినవాళ్లు... తెలియని వాళ్లు అంతా తానే నేరం చేసినట్లుగా శూలాల్లాంటి చూపులతో...

అందుకేనేమో చాలామంది ఎంత ఘోరం జరిగినా, తమకి ఎంత అన్యాయం జరిగినా మౌనంగా భరించేది, మూగగా రోధించేది.


పోలీసు కేసు పెట్టి తను తప్పు చేసిందా? ఊహుఁ... లేదు... లేదు... తప్పనిసరిగా వీళ్లపై కేసు పెట్టాల్సిందే. అలాంటి దుర్మార్గులకు శిక్ష పడాల్సిందే. మరోసారి మరో ఆడపిల్ల వారి బారినపడి బాధపడని విధంగా ఎంతటి కఠినమైన శిక్ష అయితే అంత మంచిది.

కానీ ఏం జరిగింది? ఏం జరుగుతోంది?

న్యాయంకోసం నేరం చేసిన వాడిని పట్టుకోండని పోలీసు స్టేషన్‌కు వెడితే వాళ్లేమన్నారు? 'తప్పతాగి తూలావు. ఎవడినో లేపుకొచ్చిన కులటనన్నారు.

ఒంటరి ఆడపిల్ల. 'కట్టు'కున్నవాడే కాదు పొమ్మన్నట్టుగా మిన్నకున్నాడు. ఏం చేసినా, ఏం మాట్లాడినా చెల్లుతుందనా? చట్టంలో ఉన్న లొసుగుల ఆధారంగా శిక్ష తప్పించుకో జూస్తున్నారు. ఊహుఁ... అయినా ఆ చట్టాలు చేసిందెవరు? వాళ్లేకదా? 'కులట' అయితే ఆ కామాంధులు దౌర్జన్యంగా తమ 'దాహం' తీర్చుకోవచ్చా? ఇదెక్కడి న్యాయం?

ఏ కారణం చేతనయినా ఆ విధంగా మారితే మాత్రం ఆమెపై వారికెక్కడిది అధికారం?



పరిపరివిధాల ఆలోచించి అలసి సొలసిపోయిందామె.

★ ★ ★

"తమని కాదని గడపదాటి వెళ్లిపోయిందని ఆనాడే తద్దినం పెట్టేశారు ఆమె తల్లిదండ్రులు. ఆమె పేరు ఎత్తడానికే వీల్లేదా ఇంట్లో. అలాంటిది ఇప్పుడు ఆమెకు ఆసరాగా నిలుస్తారా? మరి నువ్వెందుకురా, ఆమెకోసం బాధపడ్తావు? కన్నవాళ్లే కాదనుకున్నారు. ఇరవైఏళ్లు పెంచిన మమకారాన్ని వదిలేశారు. మరి నీకెందుకురా? ఆర్నెల్లు కాపురం చేశావ్! అంతే కదా! అయినా మీది పెళ్లే కాదు. ఏదో వయసు తొందర... అయిందేదో అయిపోయింది. ఇంటికెళ్దాం పద. ఇంక ఆ ఎంగిలి విస్తరిని ఏం చేసుకుంటావు. కులట అని ముద్రపడిన దానితో ఎలా కలిసి కాపురం చేయగలవు? బయటికెళ్తే నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటుంటే నీవు తలెత్తుకు తిరగగలవా?" అంటూ నాన్న, అన్న, బావల హితబోధలు. ఎలాగైనా తీసుకెళ్లి మరెవరితోనో పెళ్లి జరిపించేసి కట్నంగా ఇచ్చిన లక్షన్నర రూపాయలతో చెల్లెలి పెళ్లి చేయాలని ఆ తండ్రి ప్రయత్నం.

ఇది నిజమా...!

కాకూడదు... కాకూడదు. కాదని ఎవరైనా చెప్తే ఎంత బాగుంటుంది. ఈ రెండు రోజుల్లో రెండుకోట్ల సార్లయినా అనుకుని ఉంటాడు రఫీక్.

'నా రీతిక నాదికాదా? నాదే... నాదే... ముమ్మాటికీ నాదే...ఆమె ఎంగిలి విస్తరా? మరి నేనో... ఆమెను కాదని మరో పెళ్లి చేసుకుంటే... నన్నూ ఎంగిలి విస్తరి అనుకోరూ!' నా రీతిక నాదే. మరి పాపపంకిలమైన ఆమెను ఎలా చేరేది? నో... నో... నా రీతికకు ఏ పంకిలం అంటదు. ఆమె కులట కాదు. పాపాత్ములే ఆమెకు బురద అంటించారు. బురదలో ఉన్న పద్మం పద్మమే కదా! దాని విలువ తగ్గుతుందా? విధివశాత్తు అనుకోని పరిస్థితుల్లో అంటిన బురదను కడిగేసుకోవాలి. లేకపోతే నా చేతుల్తో నేనే పంకిలంలోకి విసిరేసినవాడినవుతానేమో!?

మరి పోలీసులు.. కేసు... కోర్టు... జనం కామెంట్స్ భరించగలనా? గాయం మరింత రేపడం కాదా?

నేను ఇలా ఆలోచిస్తే నాలాగే అంతా ఆలోచిస్తే... తప్పుచేసిన వాడికి శిక్షపడేదెన్నడు? మదమెక్కి నీతి తప్పినవాడికి శిక్షపడాల్సిందే. నీతిమాలినవాళ్లే... అన్యాయం చేసినవాళ్లే తమ శిక్షను తప్పించుకోవడం కోసం అడ్డదారులు తొక్కుతుంటే... నా ప్రవర్తనతో నేను నా రీతికను శిక్షించడమా? నో... నో... ఇది దురదృష్టవశాత్తు జరిగిన సంఘటన. అంతే!

మనసుకు లేని మాలిన్యం శరీరానికేల? నా రీతిక మనస్సు స్వచ్ఛమైనది. నన్నే కోరుకుంటుంది ఆమె. నా కోసం తన వాళ్లందర్నీ వదలి జీవితాంతం ఒకరికొకరుగా బతకాలన్న కోరికతో వచ్చిన ఆమెకు నేనిచ్చే బహుమతి ఇదేనా? ఛ...ఛ... రెండ్రోజుల్నుంచీ మృగంలా ప్రవర్తించి ఆమె హృదయాన్ని ఛిద్రం చేశాను. ఈ వార్త విని నేనే తట్టుకోలేకపోయానే! ఆ కర్కశుల కబంధ హస్తాల్లో చిక్కి ఎలా విలవిలలాడిందో కదా!

ఇలాంటి సమయంలోనే కదా... ఒకరికి ఒకరు తోడూ, నీడా! నాకోసం, నా ఆరోగ్యంకోసం తపన పడి వెళ్లిన ఆమెను ఇప్పటివరకు చేసిన చిత్రవధ చాలు... శారీరంగా వాళ్లు చెరబడితే, మానసికంగా నేను చెరబట్టాను. నరకయాతన పెట్టాను... అనుకుంటూ మంచం మీంచి నెమ్మదిగా లేచాడు. ఆకాశంలో మబ్బు తెరలు వీడిపోయాయి. వెలుగు ప్రకాశవంతంగా పరచుకుంది.

✻